
# సత్యవాక్యము

క్రైస్తవ మాస పత్రిక

THE WORD OF TRUTH



## మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొందియున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగ ములు, తదితర పుస్తకములు 15 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
**(P.O. Box 80) Seshagiri Rao St.**
**KAKINADA-533 004**

## ప్రకటన

318 క్రైస్తవ కీర్తనలు గల పుస్తకము ఇంకొకటి ఇప్పుడు లభించుచున్నది. దాని ఖరీదు రూ. 10/- లు; పోస్టు ఖర్చులు రూ. 1-50 అదనం. వలయువారు ఈ దిగువ సహోదరుని సంప్రదించండి.

**T. PRAKASA RAO**
**Church of Christ - Bible Learning Centre**
**KOMAROLE - 523 373.**

# సత్యవాక్య

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 12 డిశంబరు 1991 సంచిక 5


## సంపాదకీయము

### పక్షపాతము గలవారు కాకుడి

### (Not to be a Respector of Persons)

సాధారణముగా మానవుడు పక్షపాత స్వభావాన్ని కలిగియున్నాడు. శరీరము యొక్క రంగు, ధనము, జాతీయత, భాష, కులము లేక ఏదో కారణాన్ని అతడు పక్షపాతమునకు ఉపయోగించుకొనుచున్నాడు. ఇది మనుష్యులను గాయపరచి, ప్రజల హక్కులను హరించి, వారి జీవితములను ముందుకు కొనసాగనివ్వదు. మానవుల యందు వ్యాపించిన వ్యాధి యిది.

### దేవుడు పక్షపాతి కాడు

దేవుడు పక్షపాతి కాడని బైబిలు బోధించుచున్నది. పౌలు ఇట్లు చెప్పెను: "దేవునికి పక్షపాతము లేదు" (రోమా 2 : 11). బానిసత్వమును గూర్చి మాట్లాడుచు ఎఫెసీయులతో అతడు ఈలాగు చెప్పెను: "దాసులారా, యథార్థమైన హృదయము గలవారై భయము

తోను వణకుతోను క్రీస్తునకు వలె, శరీర విషయమైన మీ యజమానులైన వారికి విధేయులై యుండుడి. మనుష్యులను సంతోషపెట్టువారు చేయునట్లు, కంటికి కనబడుటకే కాక, క్రీస్తు దాసులమని ఎరిగి, దేవుని చిత్తమును మనఃపూర్వకముగా జరిగించుచు, మనుష్యులకు చేసినట్టు కాక ప్రభువునకు చేసినట్టే యిష్టపూర్వకముగా సేవ చేయుడి. దాసుడైనను స్వతంత్రుడైనను మీలో ప్రతివాడును ఏ సత్కార్యము చేయునో దాని ఫలము ప్రభువు వలన పొందునని మీరెరుగుదురు. యజమానులారా, మీకును వారికిని యజమానుడైన వాడు పరలోకమందున్నాడనియు, ఆయనకు పక్షపాతము లేదనియు ఎరిగినవారై, వారిని బెదిరించుట మాని ఆ ప్రకారమే వారి యెడల ప్రవర్తించుడి." (ఎఫెసీ 6 : 5-9). మీరు చదివిన విధముగా పౌలు మరియు క్రైస్తవులు ఆ దినాలలో బానిసత్వము అను సమస్యను ఎదుర్కొనిరి. పోరాటవాదియైనా ఉన్మాదియైనా ఆ కాలములో చెడునేగాని మంచిని జరిగించలేదు. యజమానులలోను దాసులలోను కొందరు క్రైస్తవులుండుట వలన ఒకరి యెడల ఒకరు ఎట్లు క్రైస్తవ ఆత్మతో పని చేయవలెనో వారికి పౌలు తెలియజేసెను. పౌలు యజమానులను దాసులను కూడ ప్రోత్సహించెను. క్రైస్తవ్యము బానిసత్వమును రూపు మాపగలదని అతడు ఎరిగి యుండెను. అదే జరిగెను.

కొలస్స క్రైస్తవులకు పౌలు వ్రాయుచు: "అన్యాయము చేసినవానికి తాను చేసిన అన్యాయము కొలది మరల లభించును, పక్షపాత ముండదు" (కొలస్స 3:25) అని చెప్పెను. పేతురు ఇట్లు చెప్పెను: "పక్షపాతము లేకుండ క్రియలను బట్టి ప్రతి వానిని తీర్పు తీర్చువాడు తండ్రి అని మీరాయనకు ప్రార్థన చేయుచున్నారు గనుక మీరు పరదేశులై యున్నంత కాలము భయముతో గడుపుడి" (1 పేతురు 1 : 17).

## సంఘములో పక్షపాత ముండరాదు

పక్షపాతము ఎక్కడ వ్యక్తమగుచున్నదో తెలియజెప్పుటకు యాకోబు చక్కని దృష్టాంతము నిచ్చెను. "నా సహోదరులారా, మహిమా స్వరూపి యగు మన ప్రభువైన యేసుక్రీస్తును గూర్చిన విశ్వాస విషయములో మోమాటము గలవారై యుండకుడి. ఏలాగనగా బంగారు ఉంగరము పెట్టుకొని ప్రశస్త వస్త్రములు ధరించుకొనిన యొకడు మీ సమాజ మందిరములోనికి వచ్చినప్పుడు మురికి బట్టలు కట్టుకొనిన దరిద్రుడును లోపలికి వచ్చిన యెడల మీరారు ప్రశస్త వస్త్రములు ధరించుకొనిన వానిని చూచి సన్మానించి - నీ విక్కడ మంచి స్థలమందు కూర్చుండు మని చెప్పి, ఆ దరిద్రునితో - నీ వక్కడ నిలువుము, లేక ఇక్కడ నా పాదపీఠము దిగువను కూర్చుండుమని చెప్పిన యెడల, మీ మనసులలో భేదములు పెట్టుకొని మీరు దురాలోచనతో విమర్శ చేసినవారగుదురు కారా ?" (యాకోబు 2 : 1-4). బహిరంగ సమావేశాలలో ఇంకనూ సంఘ సమావేశాలలో కూడ ఈ పరిస్థితిని మనము ఎన్నిసార్లు చూడలేదు ?

## యూదుడని, అన్యుడని లేదు

క్రీస్తు యూదులలో నుండి వచ్చెను. ఆనాడు అన్యుల యెడల యూదులు పక్షపాతము కలిగియుండిరి. కాని క్రీస్తు వచ్చినపుడు ఆయన ప్రేమ ప్రత్యక్షత ద్వారా సంగతులు మార్చబడునట్లు యూదుల యొక్కయు అన్యుల యొక్కయు పాపముల నిమిత్తమై ఆయన చనిపోయెను. అందువలన పేతురు మొట్టమొదట అన్యులకు సువార్త నందించెను. "దేవుడు పక్షపాతి కాడని నిజముగా గ్రహించియున్నాను. ప్రతి జనములోను ఆయనకు భయపడి నీతిగా నడచుకొను వారిని ఆయన అంగీకరించును" (అ.కా. 10:34-35) అని గ్రంథము తెలియజేయుచున్నది. పేతురు

ఈ విధముగ చెప్పుటకు కారణ మేదనగా ప్రభువు ముందుగా వారికి ఈ మాటలు చెప్పెను: "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:15-16).

తమ జీవితాలలో ఆయనను ముందుగా ప్రతిష్టించుకొనిన వారిని, ఆయనకు విధేయులైనవారిని, ఆయనకు నమ్మకముగా జీవించు వారిని ఆయన గౌరవించుచున్నాడు. ఆయన అందరినీ ప్రేమించి, ఆయన చిత్తమును గూర్చి వినవలెనని, సంఘు సభ్యులై క్రైస్తవ జీవితాన్ని కొనసాగించి పరలోకమునకు వెళ్ళవలెనని ఆయన కోరుచున్నాడు. తీర్పు సమయములో ఆయన పక్షపాతము లేకుండ వారు దేహముతో జరిగించిన క్రియల చొప్పున (అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే) తీర్పు తీర్చును (2 కొరింథీ 5 : 10).

## సువార్త అందరికీ

ప్రభువు ప్రజలముగా మనము ప్రతి విషయములోను క్రీస్తును వెంబడించుచు పక్షపాతము లేని వారముగ జీవించవలసి యున్నది. మనము కొందరిని కేటాయించకూడదు. మనము ధనవంతుల కొరకు పేదలను నిర్లక్ష్యము చేయరాదు. మనము అందరికొరకు విశ్వాసుల కొరకు అవిశ్వాసుల కొరకు సమయమును హెచ్చించకపోతే అవిశ్వాసులు మార్పు చెందుటకు అవకాశ ముండదు. సువార్తను మరియు ప్రభువు వాక్యమును వినుటకు సమయము లేని పెద్దవారిని, రాజకీయ నాయకులను, వినోద కార్యక్రమము లందించు వారిని, క్రీడాకారులను మరియు అనేక మందికి మనము సువార్తను ప్రకటించకుండ విడిచిపెట్టకూడదు. మనము ఎంపిక చేయబడిన కొందరికి సువార్త ప్రకటించుచున్నాము. అందువలన చాలామంది దేవునికి విధేయులు కాకపోవుట,

సంఘము ఎదుగక పోవుట జరుగుటలో ఆశ్చర్యము లేదు. మనము యేసు చెప్పిన దానిని తప్పనిసరిగ జరిగించి అందరికీ సువార్త ప్రకటించవలెను. అనేకమంది మార్పు జెందుట లేదని తలంచే మనము ప్రభువు చెప్పిన విధముగ పనిని జరిగించిన యెడల అనేక మందిని చూడగలము. పైన చెప్పిన వారుకూడ మిగిలిన వారివలె బలహీనతలు, అవసరములు కలిగియున్నారు. వారి సంపద, వృత్తి లేక మరో కారణమును బట్టి వారిని సువార్తకు దూరము చేయుట దోషము. వారికి ప్రేమ, స్నేహము అవసరము. నీవు వారికి సమృద్ధియైన మంచిని యివ్వగలిగినట్లయితే వారి స్పందనను బట్టి నీకు ఆశ్చర్యము కలుగుతుంది.

సువార్త విషయములోను; రక్షణ విషయములోను ఎవరినీ నిర్లక్ష్యము చేయకుము, ఆటంక పర్చకుము, తిరస్కరింపకుము. మనకిట్టి అనుభవము ఎదురు కావాలని కోరుకోనము. యేసుప్రభువు కూడ మనలను తిరస్కరింపకుండ ఉండటను బట్టి మనము కృతజ్ఞతను కలిగియుండవలెను. మన జీవితాలలో ప్రభువును ముందుగా ప్రతిష్ఠించుకొని ఇతరులు మనకేమి చేయవలెనని కోరుదుమో ఆలాగుననే మనము వారికి చేయుదము.

---

## మీ పోరాటము ఎవరితో? దేనికొరకు?

(గత సంచిక తరువాయి)

సంఘము అపొస్తలుల బోధయందు మాత్రము నిలకడగా ఉండాలి అని అపొస్తలులు సంఘమునకు ఇచ్చిన ఆజ్ఞలను చదువుదము : "సహోదరులారా, మా వలన పొందిన బోధన ప్రకారము

గాక అక్రమముగా నడుచుకొను ప్రతి సహోదరుని నొద్దనుండి తొలగి పోవలెనని మన ప్రభువైన యేసుక్రీస్తు పేరిట మీకు ఆజ్ఞాపించుచున్నాము" (2 థెస్స 3:6). "మేము మీకు ఆజ్ఞాపించు వాటిని మీరు చేయుచున్నారనియు ఇక చేయుదురనియు ప్రభువునందు మిమ్మును గూర్చి నమ్మకము కలిగి యున్నాము" (2 థెస్స 3:4).

"మీ అపొస్తలుల ద్వారా ఇచ్చిన ఆజ్ఞను మీరు జ్ఞాపకము చేసుకొన వలెనను విషయమును మీకు జ్ఞాపకము చేసి నిర్మలమైన మీ మనసులను రేపుచున్నాను" (2 పేతు 3:2).

"యేసుక్రీస్తు అపొస్తలులు పూర్వమందు మీతో చెప్పిన మాటలను జ్ఞాపకము చేసికొనుడి" (యూదా 1 : 17-18).

క్రీస్తు సంఘము నిరంతరము తరతరములు నిలుచును. ప్రభువు రెండవసారి వచ్చు వరకు, సర్వకాల, సర్వదేశ, సర్వావస్తలయందు సంఘము అపొస్తలుల బోధయందు ఎడతెగక యుండవలెను గదా! అయితే అపొస్తలులు మొదటి శతాబ్దములోనే చనిపోయిరి. అటువైన సంఘమునకు ఎవరివలన బోధ కలుగవలసి యున్నది?

## లేఖనములు ఏమి చెప్పుచున్నవి ?

సంవత్సరములు జరుగుచుండగా అపొస్తలులకు వారసులును ఎన్నుకొని వారిని అపొస్తలులుగా సంఘమునకు ఇచ్చి ఒక క్రొత్త బోధను బోధింప వచ్చువా? అన్నట్టు అలా ఎన్నుకొనబడి దేవునిచే పంపబడితిని అని చెప్పే బోధకులు, నాయకులు చాలా మంది మన ముందుకు వస్తున్నారు గాని వారు దొంగ అపొస్తలులును, మోస గాండ్రయిన పనివారునై యున్నారని లేఖనము చెప్పుచున్నది (2 కొరి 11 : 13-15, ప్రక 2 : 2).

అయితే సంఘము నిత్యము అపొస్తలుల బోధను ఎట్లు జ్ఞాపకము చేసికొనగలదు? 2 పేతురు 1 : 12-21 వరకు చదివి ధ్యానించండి. పేతురు-"నేను మృతి పొందిన తరువాత కూడా మీరు నిత్యము వీటిని జ్ఞాపకము చేసికొనునట్లు జాగ్రత్త చేతును". ఎట్లు జాగ్రత్త చేయును? లేఖనములుగా అనగా వ్రాయబడిన గ్రంథముగా జాగ్రత్త చేయును.

"ఒకడు తన ఊహను బట్టి చెప్పుటవలన లేఖనములో ఏ ప్రవచనమును పుట్టనని మొదట గ్రహించుకొనవలెను". ఇందు మూలముగా తెలియునది ఏమనగా అపొస్తలుల బోధ లేఖనములు చదువుట వలన మాత్రము మనము గ్రహించగలము. అపొస్తలుల బోధను లేఖనములు జ్ఞాపకము చేయును.

"మీరీలాగున రక్షింపబడి మన ప్రభువైన యేసుక్రీస్తుయొక్క మహిమను పొందవలెనని ఆయన మా సువార్త వలన (అనగా అపొస్తలులు ప్రకటించిన సువార్త) మిమ్మును పిలిచెను. కాబట్టి సహోదరులారా, నిలకడగా ఉండి, మా నోటి మాటవలననైనను మా పత్రిక వలననైనను మీకు బోధింపబడిన విధులను చేపట్టుడి" (2 థెస్స 2 : 14-15). "ఈ పత్రిక మూలముగా మేము చెప్పిన మాటకు ఎవడైనను లోబడని యెడల అతనిని కనిపెట్టి అతడు సిగ్గుపడు నిమిత్తము అతనితో సాంగత్యము చేయకుడి" (2 థెస్స 3 : 14). అపొ. పౌలు - దేవదర్శనము వలన నాకు తెలియపర్చబడిన జ్ఞానము యొక్క మర్మమును గూర్చి మీకు వ్రాసాను. దాని చదువుటవలన మీరు గ్రహించగలరు (ఎఫె 3 : 1-4) అని చెప్పుచున్నాడు.

క్రీస్తు నందలి విశ్వాస మూలముగా రక్షణార్థమైన జ్ఞానము కలిగించు శక్తి లేఖనములలో ఉన్నది (2 తిమొ 3 : 14-15). దైవ

జనుడు ప్రతి మంచి పనికి పూర్ణంగా దేవుని యెదుట సిద్ధపడి యుండు టకు లేఖనము ప్రయోజనకరమై యున్నది. ఉపదేశము, ఖండన, తప్పు దిద్దుట, నీతి నేర్పించుట లేఖనములనుండి మాత్రము జరుగ వలెను (2 తిమో 3:16-17). లేఖనములయందు వ్రాసియున్న సంగతు లను అతిక్రమింప కూడదు (1 కొరి 4:6). ఈలాగు పరలోకమందున్న తండ్రియైన దేవుడు తన చిత్తమును బయలు పర్చెను. చదివి గ్రహించ గలుగునట్లు వ్రాయబడెను (2 కొరి 1:13-14).

గమనించండి :

1. పరలోకమందున్న తండ్రి చిత్తమును కుమారుడైన క్రీస్తు లోకము నకు తెచ్చెను.
2. క్రీస్తు కొంత మట్టుకు అపొస్తలులకు బోధించి సమస్తమును బోధించు బాధ్యతను పరిశుద్ధాత్మకు అప్పగించెను.
3. పరిశుద్ధాత్మ అపొస్తలులకు సమస్తమును బోధించి సర్వ సత్యము లోనికి వారిని నడిపించెను.
4. అపొస్తలులు సర్వసత్యము సంఘమునకు బోధించుచు వారు మృతి పొందకమునుపు గ్రంథముగా వ్రాసి సంఘమునకు లేక పరిశుద్ధులకు దీనిని ఒక్కసారే అప్పగించిరి.
5. గ్రంథము అదే కొత్త నిబంధన గ్రంథము అపొస్తలులు బోధిం చిన క్రీస్తు బోధను కలిగియుండి పరిశుద్ధులు నిత్యము జ్ఞాపకము చేసికొనగలుగునట్లు అప్పగింపబడి అందరికి అందుబాటులోనున్నది.
6. లేఖనములనుండి మాత్రము పరలోకమందున్న తండ్రి చిత్తము పరిశుద్ధులకు తెలుపబడుచున్నది లేక బయలుపడు చున్నది.
7. పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడి బోధ ఇదే, ఈ బోధ నిమి త్తము పోరాడాలి.

ఏలయనగా దురదచెవులు గలవారై తమ దురాశలకు అనుకూలమైన బోధకులను తమ కొరకు పోగుచేసికొని సత్యమునకు చెవి ఇయ్యక కల్పనాకథలకు తిరుగు కాలము వచ్చును. మన ప్రభువైన క్రీస్తుకు కాక (2 తిమో 4 : 3-4) తమ కడుపునకే దాసులైనవారున్నారు. వారు అపొస్తలుల బోధకు వ్యతిరేకంగా భేదములను ఆటంకములను కలుగజేయుదురు (రోమా 16 : 17-18).

పరిశుద్ధులు వెలిగింపబడిన నాటినుండే క్రైస్తవ పోరాటము ప్రారంభమగును (హెబ్రీ 10 : 32-36). ఈ పోరాటములో ఎవరో ఒకడు వ్యక్తిగతంగా ప్రయాస పడుట మాత్రమే గాక సంఘ మంతయు ఏకమనస్సుతో విశ్వాస పక్షమున పోరాడాలి (ఫిలి 1 : 27-28). అపొస్తలులు ఈ గొప్ప పోరాటములో నిలిచిరి (ఫిలి 2 : 29, 2 కొరి 7:5, కొల 1 : 29).

లోకము మిమ్మును ద్వేషించినయెడల మీకంటె ముందుగా నన్ను ద్వేషించెనని క్రీస్తు చెప్పెను (యోహా 15 : 18). "మంచి పోరాటము పోరాడవలెనని వాటిని బట్టి ఈ ఆజ్ఞను మీకు ఇచ్చుచున్నాను" (1 తిమో 1 : 18). "విశ్వాస సంబంధమైన మంచి పోరాటము పోరాడుము. నిత్యజీవము చేపట్టుము" (1 తిమో 6 : 12).

నేనెంతగా పోరాడుచున్నానో మీరు తెలిసికొనగోరుచున్నాను "వారందరి కొరకు పోరాడుచున్నాను" (కొల 2 : 1-2).

"ఎటు పోయినను మాకు శ్రమయే కలిగెను. వెలుపట పోరాటములు లోపల భయములు ఉండెను" (2 కొరి 7 : 5).

## ముగింపు

"మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని. ఇకమీదట నా కొరకు జీవకిరీట ముంచ

బడి యున్నది. ఆ దినమందు నీతిగల న్యాయాధిపతియైన ప్రభువు అది నాకును నాకుమాత్రమే కాకుండా తన ప్రత్యక్షతను అపేక్షించు వారి కందరికిని అనుగ్రహించును" (2 తిమో 4 : 7-8).

"జెట్టియైనవాడు పోరాడునపుడు, నియమ ప్రకారము పోరాడ కుంటే వానికి కిరీటము దొరకదు" (2 తిమో 2 : 5).

ప్రియ పాఠకా మీ పోరాటము ఎవరితో ? దేని కొరకు ? ఏ నియమము చొప్పున ?

ఉపదేశ క్రమము ననుసరించి పరిశుద్ధులకు ఒక్కసారే అప్ప గింపబడిన క్రీస్తు బోధ నిమిత్తము పోరాడుదుము గాక !

—పాల్ గూటం, గొల్లపిల్లి - 533 222.

—o—

## క్రీస్తుయొక్క రెండవ రాకడ

## (The Second Coming of Christ)

క్రైస్తవుడు అత్యాసక్తితోను భక్తితోను ఎదురు చూచుచున్న సంఘటన ఒకటి యున్నది. అది క్రీస్తుయొక్క రెండవ రాకడ. 'రెండవ రాకడ' అనే పదము బైబిలులో వాడబడ లేదు గాని, దాని భావము వ్యక్తపరచబడింది (హెబ్రీ 9 : 28). "ఆలాగుననే క్రీస్తుకూడ అనేకుల పాపములను భరించుటకు ఒక్కసారే అర్పింపబడి, తన కొరకు కనిపెట్టు కొని యుండువారి రక్షణ నిమిత్తము పాపము లేకుండ రెండవసారి ప్రత్యక్ష మగును".

ఈ అంశముపై వివిధ ప్రశ్నలు తలెత్తుట, వాటికి తప్పుగ బోధింపబడుటయు జరిగినది. మనకు బయలుపరచబడిన వాటి విషయమై

సంతృప్తి చెందియుండి తెలియపరచబడని వాటి విషయమై మౌనము కలిగి యుందము.

ద్వితీ 29:29 : "రహస్యములు మన దేవుడైన యెహోవాకు చెందును. అయితే మనము ఈ ధర్మశాస్త్ర వాక్యము లన్నిటి ననుసరించి నడుచుకొనునట్లు బయలుపరచబడినవి యెల్లప్పుడు మనవియు మన సంతతి వారివియు నగునని చెప్పబడెను". అనేక సందేహములకు సమాధానములు దొరుకనప్పటికిని క్రీస్తుయొక్క రెండవ రాకడను గూర్చిన అంశముపై కొన్ని విషయములను తెలిసికొందము.

## రాకడ నిశ్చయము (Certainity)

క్రీస్తు రెండవసారి వస్తానని చెప్పిన మాటను బట్టి ఆశ్చర్యపడవలసిన పనిలేదు. "నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నాయొద్ద నుండుటకు మిమ్మును తీసికొని పోవుదును" (యోహాను 14:3). పౌలు క్రీస్తుయొక్క రెండవ రాకడను గూర్చి తెలిపెను. "మన పౌరస్థితి పరలోకమందున్నది; అక్కడ నుండి ప్రభువైన యేసుక్రీస్తు అను రక్షకుని నిమిత్తము కనిపెట్టుకొని యున్నాము" (ఫిలిప్పీ 3:20). "ఆర్భాటముతోను, ప్రధాన దూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకమునుండి ప్రభువు దిగివచ్చును; క్రీస్తునందుండి మృతులైన వారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితో కూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశ మండలమునకు మేఘముల మీద కొనిపోబడుదుము. కాగా మనము సదా కాలము ప్రభువుతో కూడ ఉందుము". (1 థెస్స 4 : 16-17).

## రాకడ సమయము (Time)

చాలమంది క్రీస్తు రెండవ రాకడకు తేదీలు నిర్ణయించారు. కాని వారందరు వారి అంచనాలలో తప్పిపోయారు. మనకు తెలియ పరచబడని వాటి విషయమై మాట్లాడుట బుద్ధిహీనతయే. మన ప్రభువైన యేసు ఈ లోకములో యుండిన దినములలో రెండవ రాకడను గూర్చి చెప్పిన మాటలు చూడండి. "అయితే ఆ దినమును గూర్చియు ఆ గడియను గూర్చియు తండ్రి మాత్రమే ఎరుగును గాని, యే మనుష్యుడైనను, పరలోక మందలి దూతలైనను, కుమారుడైనను ఎరుగరు." (మత్తయి 24 : 36). యేసే ఆయన రాకడను గూర్చి ఆయనకే తెలియదని చెప్పుచున్నపుడు ఆ సమయమును గూర్చి మనము నిర్ధారించుట మన పనికాదు. కొంతమంది అయితే దానియేలు గ్రంథము నుండియు ప్రకటన గ్రంథము నుండియు మేము గ్రహించి తెలుసుకున్నామని చెప్పుదురు. మన ప్రభువుకు కూడ దానియేలు గ్రంథము తెలుసు. ఆయనయే తన అపొస్తలుడైన యోహానుద్వారా ప్రకటన గ్రంథమును వ్రాయించెను. ఆ సమయమును గూర్చి తండ్రికి తప్ప కుమారుడైన యేసునకైనను తెలియదని ఆయనయే చెప్పుచుండెను గదా. ఈ సమయమును గూర్చి నిర్ధారించు వారందరు యేసు ప్రభువు కంటె జ్ఞానులా? ఆ సమయమును గూర్చి తండ్రికి మాత్రమే తెలియునని ఆయన చెప్పిన మాటలను బట్టి తృప్తి పొందుదము.

## రాకడ విధానము (Manner)

ఆయన రాకడ విధానము మనకు తెలియ నప్పటికిని ఆ రాకడను గూర్చిన కొన్ని విషయములు మనకు తెలుసు.

**i) ఆయన స్వయముగ వచ్చును (He will come personally)** పరలోకమునకు తండ్రియొద్దకు ఆరోహణుడగు చున్న

యేసును చూచుచుండిన శిష్యులతో దూతలు ఈ విధంగ చెప్పుచు న్నారు. "గలిలయ మనుష్యులారా, మీ రెందుకు నిలిచి ఆకాశము వైపు చూచుచున్నారు? మీ యొద్దనుండి పరలోకమునకు చేర్చుకొన బడిన యీ యేసే, ఏరీతిగా పరలోకమునకు వెళ్ళుట మీరు చూచి తిరో ఆ రీతిగానే ఆయన తిరిగి వచ్చునని వారితో చెప్పిరి" (అ.కా. 1 : 11).

ii) ఆయన ఆర్భాటముతో వచ్చును (He will come audibly). "దీనికి ఆశ్చర్య పడకుడి. ఒక కాలము వచ్చుచు న్నది. ఆ కాలమున సమాధులలో యున్న వారందరు ఆయన శబ్దము విని మేలుచేసినవారు జీవ పునరుత్థానమునకును, కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు" (యోహాను 5:28).

iii) ఆయన ప్రత్యక్షముగ వచ్చును (He will come visibly). "ఇదిగో ఆయన మేఘారూఢుడై వచ్చుచున్నాడు; ప్రతి నేత్రము ఆయనను చూచును. ఆయనను పొడిచినవారును చూచెదరు; భూజను లందరు ఆయనను చూచి రొమ్ము కొట్టుకొందురు. అవును ఆమెన్. ప్రతి నేత్రము ఆయనను చూచును" (ప్రకటన 1:7).

v) మనకు తెలియకుండ ఆయన వచ్చును (He will come unannounced). "రాత్రివేళ దొంగ యేలాగు వచ్చునో ఆలాగే ప్రభువు దినము వచ్చునని మీకు బాగుగ తెలియును" (1 థెస్స 5 : 2). దొంగ యెప్పుడు వచ్చునో మనకు తెలియదు. మత్తయి 24వ అధ్యాయములోని గుర్తు లన్నియు క్రీ॥శ 70వ సంవత్స రములో జరుగబడిన యెరూషలేము దేవాలయ నాశనమును గూర్చినట్టివి. ఆ గుర్తులను గూర్చి ప్రభువు చెప్పిన మాటలు, "ఇవన్నియు జరుగువరకు ఈ తరము గతింపదని నిశ్చయముగ

మీతో చెప్పుచున్నాను". (మత్త 24 : 34) ఆయన రాకడ కొరకు సిద్ధముగ యుండి కనిపెట్టుమని ఆయన చెప్పెను. మనము తలంచని ఘడియలో ఆయన రాకడ వచ్చును. అయినను అందరు ఆయనను చూస్తారు, వింటారు. కనుక ఆయన రహస్యముగ వచ్చునని చెప్పుట సరియైనది కాదు.

## ఆయన రాకడయొక్క ఉద్దేశములు (Purposes)

ఆయన రెండవసారి వచ్చినపుడు యేమి చేయును అనుదాని గూర్చి విభిన్న బోధలు గలవు. మనకు తెలియపరచబడని వాటి విషయమై అనేక మంది ఆసక్తి కలిగి ఎందరినో తప్పు మార్గములోనికి నడిపించుచున్నారు. మనకు బైబిలు బోధించుచున్న విషయములను బట్టి సంతృప్తి కలిగి యుందము.

**1. పాపపరిహారార్థముగా ఆయన వచ్చుట లేదు :** ఆయన మొదటిసారి పాపపరిహారార్థ బలిగా అర్పింపబడెను, ఆలాగుననే క్రీస్తు కూడ అనేకుల పాపములను భరించుటకు ఒక్కసారే అర్పింపబడి, తన కొరకు కనిపెట్టి యుండువారి రక్షణ నిమిత్తము పాపము లేకుండ రెండవసారి ప్రత్యక్షమగును (హెబ్రీ 9 : 28). యేసుక్రీస్తు యొక్క శరీరము ఒక్కసారే అర్పింపబడుటచేత ఆ చిత్తమును బట్టి మనము పరిశుద్ధ పరచబడి యున్నాము. అది అందరి కొరకు ఒక్కసారే చేయబడిన అర్పణ (హెబ్రీ 10 : 10).

**2. రాజుగా యుండుటకు ఆయన వచ్చుట లేదు :** అపొస్తలుడైన పౌలు ఆయనను గూర్చి చెప్పిన మాటలు : "ఆ సర్వాధిపతి రాజులకు రాజును, ప్రభువులకు ప్రభువునై యున్నాడుం పరలోక మందును, భూమిమీదను సర్వాధికారముతో కూడిన రాజై యుండి తండ్రియొక్క కుడి పార్శ్వమున ఆయన ఆసీను

వయ్యెను (1 తిమో 6 : 15). యేసు వారి యొద్దకు వచ్చి, పరలోక మందును, భూమి మీదను నాకు సర్వాధికారము ఈయబడి యున్నది (మత్తయి 28:18). ఆయన రాజ్యము లేని శక్తిహీనుడయిన రాజు కాదు.

**3. రాజ్యమును స్థాపించుటకు ఆయన వచ్చుటలేదు:** బైబిలు నందు వాగ్దానము చేయబడిన ప్రకారము ఆయన తిరిగివచ్చి యెరూషలేములో రాజ్యమును స్థాపించునని కొందరు నమ్ముదురు. ఆయన మొదటిసారి రాజ్యమును స్థాపించుటకే వచ్చెను గాని యూదు లాయనను నిరాకరించి నందున ఆ పని జరుగలేదనియు, రెండవసారి వచ్చినపుడు రాజ్యస్థాపన జరుగుననియు వారు చెప్పెదురు. మొదటిసారి రాజ్యస్థాపన జరుగనపుడు రెండవసారి జరుగునని ఏలాగు నమ్మగలము?

ఆయన మొదటిసారి వచ్చినపుడే రాజ్యస్థాపన జరిగినది. కావున మరియొక సారి రాజ్యస్థాపన జరుగునని చెప్పుటలో అర్థము లేదు. రెండవసారి వచ్చినపుడు ఆయన రాజ్యాన్ని స్థాపించరు. ఆ పని మొదటిసారే జరిగింది. ఆ రాజ్యమునకు ఆయన యిపుడు రాజుగా యున్నారు. ఆ రాజ్యము యెప్పుడు స్థాపించబడినదో అనే అంశమును గూర్చి మూడు విషయములను గమనించుదము.

a) "మరియు ఆయన - ఇక్కడ నిలిచియున్న వారిలో కొందరు దేవుని రాజ్యము బలముతో వచ్చుట చూచువరకు మరణము రుచి చూడరని నిశ్చయముగ మీతో చెప్పుచున్నాను" (మార్కు 9 : 1). క్రీ॥శ 32లో మన ప్రభువైన యేసు ఈ మాటలు చెప్పెను. రాజ్య స్థాపనను గూర్చి, రాజ్యమునుగూర్చి యేసు ప్రభువు మాటలు యథార్థములేనా? రాజ్యము స్థాపింపబడినదా? ఆ రాజ్యము వచ్చి యుండని యెడల అప్పటి ప్రజ లందరు యింకను జీవించియే యున్నారా?

ఈ విషయములను గూర్చిన సత్యము క్రీ॥శ 33లో అ.కా. 2వ అధ్యాయములోని పెంతెకొస్తు దినమున జరిగినట్లు గ్రహించగలము. ఆయన రాజ్యము ఆ దినముననే స్థాపింపబడినది. ఆయన రాజ్యము బలముతోను, శక్తితోను వచ్చునని గ్రహించుచున్నము.

బి) "అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చినపుడు మీరు శక్తి నొందెదరు గనుక మీరు యెరూషలేములోను, యూదయ సమరయ దేశముల యందంతటను, భూదిగంతముల వరకును, నాకు సాక్షులై యుందురని వారితో చెప్పెను" (అపొ.కా. 1 : 8). దేవుని రాజ్యము శక్తితో వచ్చును. ఆ శక్తి పరిశుద్ధాత్మ ద్వారా కలుగును, రాజ్యము, శక్తి, పరిశుద్ధాత్మ యను మూడు విషయము లిందు కలసియున్నవి. వీటిలో ఏ ఒక్కటియైన యెప్పుడు వచ్చెనో మనము తెలుసుకొన గలిగిన యెడల ఈ మూడును యెప్పుడు జరిగెనో తెలుసుకొన గలము.

సి) "పెంతెకొస్తు అను పండుగ దినము వచ్చినపుడు అందరు ఒక చోట కూడి యుండిరి. అప్పుడు వేగముగా వీచు బలమైన గాలి వంటి యొక ధ్వని ఆకాశమునుండి అకస్మాత్తుగ వారు కూర్చుండి యున్న యిల్లంతయు నిండెను. మరియు అగ్ని జ్వాలల వంటి నాలుకలు విభాగింపబడి నట్లుగా వారికి కనబడి, వారిలో ఒక్కొక్కని మీద వ్రాలగ అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మ వారికి వాక్శక్తి అనుగ్రహించిన కొలది అన్య భాషలతో మాటలాడసాగిరి" (అపొ.కా. 2:1-4). ఈ వచనముల ద్వారా పరిశుద్ధాత్మ అపొస్తలుల మీదికి యెప్పుడు వచ్చెనో తెలియుచున్నది. అది పెంతెకొస్తు దినమున జరిగినది. రాజ్యము, శక్తి, పరిశుద్ధాత్మ ఈ మూడును కలసియున్నవి. పరిశుద్ధాత్మ పెంతెకొస్తు దినమున వచ్చెను. కనుక దేవుని రాజ్యము కూడ ఆదినముననే వచ్చెను. ఆయన మొదటిసారి యేసుని

చేయుటకు ఉద్దేశించి వచ్చెనో ఆ పనిని ఆయన నెరవేర్చెను.

రాజ్యమును తండ్రికి అప్పగించుటకు ఆయన వచ్చుచున్నాడు. అటు తరువాత ఆయన సమస్తమైన ఆధిపత్యమును సమస్తమైన అధికారమును, బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యమును అప్పగించును (1 కొరి 15 : 24). ఆయన రాజై యుండి నందున రాజ్యమును స్థాపించుటకు రెండవసారి వచ్చుట లేదు. కాని పెంతెకొస్తు దినమున స్థాపింపబడిన ఆయన రాజ్యమును తండ్రికి అప్పగించుటకు ఆయన వచ్చును. ఆయన రాజుగా యుండి యిక పాలించరు.

5. లోకమునకు తీర్పు తీర్చుటకు ఆయన వచ్చును. ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైనను సరే, చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మన మందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును (2 కొరి 5 : 10).

6. బహుమానమును, శిక్షయు ఆయన ఇచ్చును. దీనికి ఆశ్చర్యపడకుడి, ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమున సమాధులలో యున్న వారందరు ఆయన శబ్దము విని మేలుచేసినవారు జీవ పునరుత్థానమునకును, కీడుచేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు (మత్తయి 25 : 46). వీరు నిత్య శిక్షకును, నీతి మంతులు నిత్యజీవమునకును పోవుదురు (యోహాను 5 : 28-29).

మనము నేర్చుకొనదగు విషయము. క్రీస్తు రెండవ రాకడను గూర్చి ఆయన రాజ్యములో మనము ప్రవేశించి విశ్వాసముతో మెలకువగ యుండి కనిపెట్టుదము (మత్తయి 24:42). కావున ఏ దినమున మీ ప్రభువు వచ్చునో మీకు తెలియదు. గనుక మెలకువగా నుండుడి.

సంఘము అనబడిన ఆయన రాజ్యములో ప్రవేశించుటకు క్రీస్తు నందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారు మనస్సు నొంది క్రీస్తును రక్షకునిగ ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెను (మార్కు 16 : 16; అ.కా. 2 : 38; రోమా 10 : 10; 1 పేతురు 3 : 21).

—ఆల్బర్ట్ గార్డనర్.

---

## అపొస్తలులద్వారా పరిశుద్ధాత్మ కార్యములు

ప్రభువైన యేసు శరీరధారియైయున్న దినాల్లో ఆయన తన అపొస్తలులను వెంటబెట్టుకొని వెళ్ళినా, బోధించుట స్వస్థపరచుట, అద్భుతములు, సూచకక్రియలు వగైరాలు స్వయంగా ఆయనే చేస్తుండేవారు. ఆయన వెళ్ళి, పరిశుద్ధాత్మను పంపిన తరువాత పరిశుద్ధాత్మ అపొస్తలుల వెనువెంట వున్నా, అదృశ్యంగా తన స్వరూపాన్ని బట్టి ఉంటాడు గనుక తాను చేయ నుద్దేశించిన కార్యములను ఆయన ప్రభువుయొక్క అపొస్తలులద్వారా, లేక వారితో చేస్తూ వుండేవాడు.

ఉదా : క్రొత్త నిబంధనకు ప్రారంభోత్సవం చేయాలి. ఆ సమయంలో శరీరధారియైన ప్రభువే ఉన్నారనుకో, అప్పుడు ఆయన తన శిష్యులచేత ప్రారంభోత్సవం చేయించకుండ, ఆయనే స్వయంగా (inaugural address) ప్రారంభ ప్రసంగం చేసి వుండేవారే! ఆయన ఆరోహణుడై తేజోమయుడైన తరువాత పరిశుద్ధాత్మను తాను ముందుగా ఉన్న స్థానానికి పంపారు. అయితే పరిశుద్ధాత్మ తానే స్వయంగా మాటలాడక, ఆ కార్యక్రియాన్ని అపొస్తలులద్వారా జరిగించబూనాడు. పెంతెకొస్తు దినమున పేతురు ప్రసంగించినా, అతడు పరిశుద్ధాత్మకు నోరుగా లేక బూరగా మాత్రమే వినియోగింపబడ్డాడు.

తాము బోధించేటప్పుడు తక్కిన అపొస్తలులు కూడా అలాగే వాడ బడ్డారు (అపొ. 2:4).

పరిశుద్ధాత్మ "వారికి వాక్ శక్తి" అనుగ్రహిస్తాడు; వారు మాటలాడతారు. వారు అన్యభాషలలో మాట్లాడితేనేమి, తమకు తెలిసిన భాషతో మాట్లాడితేనేమి అపొస్తలులు దేవుని పక్షంగా నిలిచి మాట్లాడినప్పుడెల్లా, వారి శ్రోతలకు వారు మాట్లాడింది అర్థమయ్యింది (అపొ. 2:4-8).

పైగా, వారు మాటలాడినను సువార్త ప్రకటించినను జ్ఞాన యుక్తమైన తియ్యని మాటలు వినియోగింపక, పరిశుద్ధాత్మయు దేవుని శక్తియు కనుపరచు దృష్టాంతములనే వినియోగించారు (1 కొరింథీ 2:1-2). తమ శ్రోతల విశ్వాసం మనుష్య జ్ఞానమును ఆధారం చేసుకో కుండా వుండాలని అపొస్తలులు వాక్ చాతుర్యాన్ని గాని జ్ఞానాతి శయాన్ని గాని ప్రదర్శించలేదు (1 వచ). పరిశుద్ధాత్మ ఆధీనంలో వున్న అపొస్తలుల బోధ ఎలాటిదో పౌలు మాటల్లో విందాం: "మేము దేవుని వాక్యమును కలిపి చెరిపెడు అనేకులవలె ఉండక, నిష్కా పట్యముగల వారమును దేవుని వలన నియమింపబడిన వారమునై యుండి, క్రీస్తునందు దేవుని యెదుట బోధించుచున్నాము" (2 కొరింథీ 2 : 17). మా ద్వారా ప్రతి స్థలమందును క్రీస్తునుగూర్చిన జ్ఞానము యొక్క సువాసనను కనుపరచుచు ఆయన యందు మమ్మును ఎల్ల ప్పుడు విజయోత్సవముతో ఊరేగించుచున్న దేవునికి స్తోత్రము" (14వ) ఈ కార్యమంతా పరిశుద్ధాత్మ ద్వారా జరిగిందే! (యోహాను 15 : 26-27).

తన్ను ప్రేమించే వారికొరకు దేవుడు ఏవి సిద్ధపరచాడో అవి పాతనిబంధన కాలంలో కంటికి కనబడలేదు, చెవికి వినబడలేదు,

మనుష్య హృదయమునకు గోచరము కాలేదు (1 కొరింథీ 2:9) అని వ్రాయబడియుంది. "మనకైతే దేవుడు వాటిని తన ఆత్మ వలన బయలుపరచియున్నాడు; ఆ ఆత్మ అన్నిటిని, దేవుని మర్మములను కూడా పరిశోధించుచున్నాడు. ...దేవుని వలన మనకు దయచేయబడిన వాటిని తెలిసికొనుటకై మనము లౌకికాత్మను కాక దేవుని యొద్దనుండి వచ్చు ఆత్మను పొందియున్నాము. మనుష్య జ్ఞానము నేర్పు మాటలతో గాక ఆత్మ సంబంధమైన సంగతులను ఆత్మ సంబంధమైన సంగతులతో సరిచూచుచు ఆత్మ నేర్పు మాటలతో వీటిని గూర్చియే మేము బోధించుచున్నామని" అపొస్తలు లంటున్నారు (1 కొరింథీ 2:11-14). గనుక మర్మాలు సయితం పరిశుద్ధాత్మ ద్వారానే అపొస్తలులకు బయలుపరచబడ్డాయి. అందులో మాటలు సయితం పరిశుద్ధాత్మయే అందించినట్టు వారన్నారు (16:13).

ప్రభువు తన అపొస్తలులతో ఉన్నప్పుడు ఆయనే సూచక క్రియలు చేస్తూ ఉండేవారు. కాని పరిశుద్ధాత్మయైతే తన కార్యాలను సయితం అపొస్తలుల ద్వారానే జరిగించారు. యెరూషలేము దేవాలయంవద్ద పుట్టు కుంటివానిని లేపి, ప్రభువును మహిమపరచడంతో ప్రారంభమై, "ప్రజలమధ్య అనేకమైన సూచక క్రియలను మహాత్కార్యములును అపొస్తలులచేత చేయబడుచుండెను" (అపొ. 3:1-5; 5:12).

రక్తస్రావ రోగపు స్త్రీ విశ్వాసముతో ప్రభువుయొక్క వస్త్రపు చెంగును ముట్టి స్వస్థత పొందెను (లూకా 8:43-48). ఇప్పుడైతే పౌలు వేసుకొన్న వస్త్రపు చెంగు అవసరంలేదు. "అతని శరీరమునకు తగిలిన చేతి గుడ్డలైనను నడికట్లయినను రోగులయొద్దకు తెచ్చినపుడు రోగములు వారిని విడిచెను, దయ్యములు కూడా వదలిపోయెను" (అపొ. 19 : 12). ప్రభువు చేసిన దానికంటె యివి విశేషంగా

కనబడటంలేదా? మరొక సంగతి చూచామంటే యిది అల్పంగా కన్పిస్తుంది చూడు?

చేతగాని నేటి మోసగాండ్లవలె, అపొస్తలులు స్వస్థత కూటాలు పెట్టినట్టు లేదు. రోగులకొరకు ప్రార్థన చేయబడునని వారు ప్రకటించినట్టు లేదు. పేతురు అపొ.కా. 5లో నడిచిపోతున్నాడట? అంతకు ముందు రెండు సంభవాలు జరిగాయి. అననీయ సప్పీరాలు— "ప్రభువుయొక్క ఆత్మను శోధించుటకు ఏకీభవించారట" (అపొ. 5:9). పరిశుద్ధాత్మను మోసపుచ్చుటకు సాతాను అననీయ హృదయాన్ని ప్రేరేపించాడట (5:3). గనుక పేతురు వారితో మాట్లాడుతున్నప్పుడు ఒకరి తరువాత ఒకరు చచ్చిపోయారు. అప్పుడు జనులకు ఒక విధంగా భయం కలిగింది. మరొక ప్రక్క పరిచర్య పెరిగింది. అపొస్తలుల బోధకు భిన్నమైనది అంగీకరించబడదని ఋజువైయింది.

"అందుచేత పేతురు వచ్చుచుండగా జనులు రోగులను వీధుల లోనికి తెచ్చి, వారిలో ఎవని మీదనైనను అతని నీడయైనను పడవలెనని మంచములమీదను పరుపులమీదను వారిని ఉంచిరి". ఎందుకు ఉంచారట? స్వస్థత ప్రార్థనలకా? కాదు మరి దేనికి? పేతురు వచ్చేటప్పుడు అతని నీడ పడడానికి; పడితే ఏం జరుగుతుందో! "మరియు యెరూషలేము చుట్టునుండు పట్టణముల జనులు రోగులను అపవిత్రాత్మలచేత పీడింపబడిన వారిని మోసికొని కూడి వచ్చిరి. వారందరు స్వస్థత పొందిరి" (అపొ. 5 : 15-16). ఏంజరిగితే వారందరు స్వస్థత పొందారట? పేతురు నీడ పడితే!! ప్రభువైన యేసు నీడ బడితే స్వస్థతపొందినవారున్నట్టు ఋజువులేదు. కాని పరిశుద్ధాత్మ అపొస్తలులతో వున్నప్పుడు ప్రభువు చేసిన అద్భుతాలకంటె మరి ఎక్కువైన అద్భుతములు అపొస్తలుల వలన జరిగాయ్. ఇదీ పరిశుద్ధాత్మ కార్యమే!

అంతేకాదు. అపొస్తలులు ఎవరిమీద చేతులుంచి ప్రార్థన చేస్తారో వారికికూడా సూచక క్రియలు చేయగల శక్తి యివ్వబడింది. యెరూషలేము స్థానిక సంఘంలో చిన్న సమస్య బయలుదేరింది. దానిని దిద్దటానికి వారిలోనుండి 7గురు మనుష్యులను ఏర్పాటు చేసుకొని వారిని అపొస్తలుల ఎదుట నిలబెట్టారు. అపొస్తలులు ప్రార్థన చేసి వారిమీద చేతులుంచారు (అపొ. 6 : 1-6). వారిలో ఒకడు ఫిలిప్పు.

ఈ ఫిలిప్పు సమరయ ప్రాంతానికి వెళ్ళి దేవుని రాజ్యమును గూర్చియు యేసుక్రీస్తు నామమును గూర్చియు సువార్త ప్రకటిస్తున్నాడు. అతని మాటలను నమ్మిన స్త్రీలు పురుషులు బాప్తిస్మము పొందారు. ఫిలిప్పు ద్వారా సూచక క్రియలును గొప్ప అద్భుతములును జరుగుచున్నాయ్. చూచినవారు విభ్రాంతి నొందుతున్నారు. అటు సూచక క్రియలు అద్భుతాలు అపొస్తలుల వలన చేయబడుటయే కాదు; ఇటు వారు చేతులుంచి ప్రార్థించిన ఫిలిప్పులాంటి వారి వలన కూడా ఈ కార్యాలు జరిగాయి (అపొ. 8 : 12-16).

అయితే అపొస్తలులకును, అపొస్తలులు చేతులుంచి ప్రార్థించిన ఫిలిప్పులాటి వారికిని తాము చేయగల కార్యంలో వ్యత్యాసముంది. అపొస్తలులు చేతులుంచి ప్రార్థించినప్పుడు తమద్వారా పని చేయు పరిశుద్ధాత్మ యొక్క పరిమాణాన్ని బట్టి వారు యితరులకు కృపావరాలు యివ్వగలిగారు; అపొస్తలుల యొద్దనుండి ఆ కృపావరమును పొందినవారు-తిరిగి అదే వరమును యితరులకు యివ్వగల శక్తి లేక యుండిరి. బాప్తిస్మము పొందిన సమరయులోని విశ్వాసులకు ఈ కృపావరమును (తాను పొందినట్టు) ఫిలిప్పు యివ్వలేకపోయాడు. అందు వలననే ఈ పనికొరకు యెరూషలేము సంఘమునుండి పేతురు యోహానులు సమరయ వరకు పంపబడ్డారు (అపొ. 8:12-14).

విశ్వాసుల మీద అపొస్తలులు చేతులుంచి ప్రార్థించితే ఏమి జరుగుతుందో గమనించు. "వీరు వచ్చి వారు పరిశుద్ధాత్మను పొంద వలెనని వారి కొరకు ప్రార్థించిరి". పేతురు యోహానులు వారిమీద చేతులుంచినప్పుడు, దృశ్యమయే విధానంలో పరిశుద్ధాత్మ సమరయుల లోని విశ్వాసులమీదికి దిగి వచ్చాడు. ఆ దృశ్యం కేవలం విశ్వాసు లకు పరిశుద్ధులకు మాత్రమే కనబడేది కాదు; ఘోర దుష్టత్వం లోను దుర్నీతి బంధకంలోను వున్న గారడీ సీమోనుకు కూడా కన బడింది (అపొ 8 : 15-24). ఇది వాగ్దానం చేయబడిన ఆత్మ కాదు; ఇది కేవలం అపొస్తలులద్వారా పరిశుద్ధాత్మ సమరయులను స్థిరపరచ డానికి జరిగించిన కార్యమే! పౌలు కూడా ఎఫెసులో ఈ కార్యం చేయగలిగాడు (అపొ. 19:1-5).

అపొస్తలుల ద్వారా పరిశుద్ధాత్మ జరిగించిన యిలాటిదే మరొక కార్యక్రమముంది. బాల్యదశలో నున్న స్థానిక సంఘాలను విశ్వాసంలో స్థిరపరచడానికి జరిగిన ఏర్పాటది. ఏమంటే స్థానిక సంఘ పరిధిలో కృపావరములు అనుగ్రహింపబడుట! "మరియు సహోదరు లారా, ఆత్మసంబంధమైన వరములను గూర్చి మీకు తెలియకుండుట నాకు యిష్టము లేదు...కృపావరములు నానా విధములుగా ఉన్నవి గాని ఆత్మ ఒక్కడే అయినను అందరి ప్రయోజనము కొరకు ప్రతి వానికి ఆత్మ ప్రత్యక్షత అనుగ్రహింపబడుచున్నది" (1 కొరింధీ 12:1-8).

విశ్వాసులు ధర్మశాస్త్రము ననుసరించి నడువకూడదు; అయినా అప్పటికి యింకా క్రొత్త నిబంధన పూర్తిగా బయలుపరచ బడలేదు (ఫిలిప్పీ 3:15-16). క్రీస్తు నందలి విశ్వాసం లోకమందంతట ప్రకటింపబడింది (కొలస్స 1 : 23). అప్పటిలో పరిశుద్ధాత్మ తన కార్యాలను అపొస్తలులద్వారాను, వారు చేతులుంచి ప్రార్థించిన

కొ్రత్త నిబంధన ప్రవక్తలద్వారాను వారిని ప్రేరేపించి నడిపించుట ద్వారా జరిగిస్తున్నాడు. పైగా అపొస్తలులు తిమోతి, తీతు లాంటి యౌవనులకు తర్ఫీదు నిచ్చి ఆయా స్థలాల్లో పరిస్థితులను చక్కదిద్దుటకు పంపుతున్నారు (1 తిమో 1:3; తీతు 1:5). కోత విస్తారము పని వారు కొద్దిమంది అన్నట్టు పరిస్థితులున్నాయి.

అలాటి పరిస్థితుల్లో స్థానిక సంఘాల్లోని పరిశుద్ధుల మీద అపొస్తలులు చేతులుంచి ప్రార్థించుట వలన కృపావరములు అనుగ్రహింపబడ్డాయి. వారిలో ఒకనికి ఆత్మమూలముగా బుద్ధివాక్యము, మరియొకనికి జ్ఞాన వాక్యము, మరియొకనికి విశ్వాసము, మరియొకనికి స్వస్థపరచు వరము, మరియొకనికి అద్భుత కార్యములు చేయు శక్తియు, మరియొకనికి ప్రవచనము, మరియొకనికి ఆత్మల వివేచనము, మరియొకనికి నానావిధ భాషలు, మరియొకనికి భాషల అర్థము చెప్పు శక్తియు అనుగ్రహింపబడి యున్నవి. అయినను వీటన్నిటిని ఆ ఆత్మ ఒక్కడే తన చిత్తము చొప్పున ప్రతివానికి ప్రత్యేకముగా పంచి యిస్తూ కార్యాభివృద్ధి కలుగజేయుచున్నాడు (1 కొరి 12:8-16).

పెద్ద బిల్డింగు కట్టే పని కొనసాగుతున్నప్పుడు, దాన్ని కట్టడానికి పరంజీలు అవసరమౌతాయి; గుర్తించారా? అవి అవసరమైనవే; గాని తాత్కాలికమైనవి. అవి లేకుండా బిల్డింగు కట్టడం కష్టమే; బిల్డింగ్ పని ముగిసిన తరువాత వాటిని అలా వుంచడం కూడా అసభ్యం; అర్థరహితమే!

కట్టబడుతున్న కట్టడం యుగాంతము వరకు నిలిచి ఉండబోయే కొ్రత్త నిబంధన. దాన్ని స్వాతంత్ర్యమునిచ్చు సంపూర్ణ నియమమని అన్నారు (యాకోబు 1 : 25). అదే పరిపూర్ణమైనది. దాన్ని పరిపూర్ణంగా బయలుపరచబూని, పరిశుద్ధాత్మ అపొస్తలులద్వారా ఈ కార్యక్రమాలన్నీ జరిగించుకొంటూ వస్తున్నాడు. [సశేషం]

—G. దేవదానం, మద్రాసు-12.

# సంక్షిప్త వార్తలు

డెల్టా ప్రాంతపు సువార్తికుల సమావేశము నవంబరు 30వ తేదీన చెయ్యేరులో ఆశీర్వాదకరంగా జరిగెను. "ప్రేమయందు అతుకబడి సంపూర్ణ గ్రహింపు యొక్క సకలైశ్వర్యము పొందుట ఎట్లు?" కొలస్స 2 : 2 అను ప్రాముఖ్యమైన అంశముపై క్షేమాభి వృద్ధికి దోహదంచేసే చక్కని భావాలు ప్రియ సోదరుల ద్వారా అందరికీ అందించ బడెను. ఈ చరిత్రాత్మక సమావేశము డెల్టా ప్రాంతపు సహోదరుల మధ్య చక్కని అవగాహన, ఐక్యత, ప్రేమను కలిగించి ఒకరి నొకరు అర్ధము చేసికొనుటకు గొప్ప అవకాశమును కలుగజేయు చున్నది.

ఈ సమావేశమునకు సోదరులు బి. ధనరాజు (అమలాపురం) గారు హాజరై "ప్రేమయందు అతుకబడుట" ను గూర్చి చర్చ ప్రారంభించి, సహోదరులకు ప్రోత్సాహమును కలిగించు చక్కని వివరణలను యిచ్చి క్రైస్తవ విధులను గూర్చిన ప్రాముఖ్యమైన సంగతులను తెలియజేసిరి. సోదరులు బైబిల్ సెమినార్ నిర్వాహకులు కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ డైరెక్టరు, నెహెమ్యా గూటంగారు మాటలాడుచూ సజీవమైన రాళ్ళు ప్రేమవలన అతుకబడి ఆత్మ సంబంధమైన మందిరముగా కట్టబడుచున్నవని మిక్కిలి సరళమైన భాషలో వివరించిరి. వేరు వేరుగా నున్న రాళ్ళు ప్రేమతో ఒకదాని కొకటి అతుకబడి మందిరముగా కట్టబడియున్నదని ఈ కట్టడము సరయిన స్థితిలో ఉండుటకు వాక్యము అవసరమని తెలియ జేయబడెను. ఆ రోజు సభకు అధ్యక్షత వహించిన సోదరులు పాల్ గూటంగారు సంపూర్ణ వాక్య గ్రహింపులో నున్న సకలైశ్వర్యమును వివరించిరి.

చెయ్యేరు స్థానిక క్రీస్తు సంఘము వ్యయ ప్రయాసలతో, ఐక్యతతో పనిచేసి గొప్ప బహిరంగ కూటమును నిర్వహించగలుగునట్లు విస్తృత మైన ఏర్పాట్లు జరిగించిరి. పెద్ద సంఖ్యలో అనేక గ్రామాలనుండి కూడ సువార్తికులు, విశ్వాసులు మరియు అవిశ్వాసులు హాజరై సువార్తను వినిరి. సోదరులు జాషువా గూటంగారు కుటుంబ సమేతముగా ఈ కూట

మునకు హాజరైరి. ఆయన తన సహజమైన శైలిలో "ప్రేమయొక్క స్వభావము దాని పని" ని గూర్చి గొప్ప ప్రసంగమును అందించిరి. ఈ ఉపన్యాసము ఆత్మీయానంద తరంగాలుగా అనేక హృదయాలలో పొర్లి పారెను. ప్రేమయొక్క స్వభావమును గూర్చి వినిన ప్రజలు గొప్ప ఆదరణను పొందిరి. 6 గురు బాప్తిస్మము పొందిరి. జనవరి 1991 నుండి ఇప్పటి వరకు జరిగిన సువార్తికుల సమావేశాలలో 46 మంది బాప్తిస్మము పొంది ఆయా స్థానిక సంఘాలలో జరుగు గొప్ప పనిలో సహకరించుచున్నారు. ఈ సమావేశాలద్వారా అనేకులు విశ్వాసములో బలపడుచున్నారు. స్థానిక గ్రామ మంతటికిని సువార్త అందింపబడు చున్నది.

సోదరులు ఇ.కె.వి. ప్రసాదరావుగారు చెయ్యేరు, అనాతవరం స్థానిక సంఘాలలో వాక్య పరిచర్య చేయుచున్నారు. ఈ కార్యక్రమము స్థానిక సంఘమునకు ప్రోత్సాహము, ఆనందము మరియు ఆశీర్వాదము కలుగజేసెను. ★

---

Regd. No. H/KD-45/KD.H.O.

*From*
**SATYA WAKKU**
P.O. Box 80
KAKINADA 533 001

**No.**

**To**
..............................
..............................
..............................
..............................